క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు



సంతలో ప్లాస్టిక్ సంచులు వాడవద్దని చెబుతున్న ఈవోపీఆర్డీ చంద్రశేఖర్

ఉంగుటూరు: ప్లాస్టిక్‌ను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలంలో ప్లాస్టిక్‌వాడకం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల వచ్చే అనార్థాలను వివరించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రందే లక్ష్మీసునీత, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి



న్యాయసేవలపై సమీక్షిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ప్యానల్ లాయర్లు విచారణ జరిగే కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు భరోసాను ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు రత్నప్రసాదు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదుల ద్వారా వాదించే ఉచిత న్యాయ సేవలపై గురువారం సమీక్షించారు. అధికారులు సమన్వయంతో ఉచిత లీగల్ ఎయిడ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవల పైన ప్రచారం చేయాలని అనానరు. జూలై 05న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సభ్యులు, ప్యానల్ లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరపై రైతుల నిరాశ

ఏలూరు (టూటౌన్): కేంద్రం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రకటించిన మద్దతు ధర రైతులను మరోసారి నిరాశపరిచిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వరితో సహా 14 పంటలకు ప్రకటించిన మద్దతు ధర రైతాంగానికి ఆమోదయోగ్యంగా లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సి-2 ప్లస్ 50 శాతం ఆధారంగా మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో వరికి రూ.117 ప్రకటించారని, ప్రస్తుతం రూ.48 తక్కువగా కేటాయించి సాగుకు, వ్యయానికి పొంతన లేని విధంగా మద్దతు ధర ప్రకటించి రైతులను మోదీ మరోసారి మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం విత్తనాలు, పురుగు మందుల ధరలు, డీజిల్ ధరలతో పాటు పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగిందని, ఆ స్థాయిలో మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసగిస్తున్నారని విమర్శించారు. రైతాంగానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఏలూరులో హెచ్‌ఎంలకు స్థాన చలనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. సత్రంపాడు హైస్కూల్‌కు ప్రసన్నాంజనేయులు, చాటపర్రు హైస్కూల్‌కు వి.మురళీ కృష్ణ బదిలీ అయ్యారు. ఇంద్రికగూడెం పాఠశాలకు ఎస్ ఉమ, హనుమాన్ నగర్ పాఠశాలకు వి.సీతారామయ్య, పోణంగి పాఠశాలకు పీడీ విజయ కుమార్, గుడివాకలంక పాఠశాలకు బి.శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. సునీత ఏలూరు సుబ్బమ్మదేవి పాఠశాలకు, కస్తూరిబా బాలికోన్నత పాఠశాలకు సుబ్బమ్మదేవి స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ కె.మాధవీలత పదోన్నతిపై ప్రధానోపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. ఏఆర్‌డీజీకే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ వీకే జయకుమార్ అదే పాఠశాలకు పదోన్నతిపై ప్రధానోపాధ్యాయునిగా నియమితులయ్యారు. ఏఆర్‌డీజీకే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఉజ్వల దక్షిణపు వీధి పాఠశాలకు బదిలీ అయ్యారు.

చెరువుల అభివృద్ధికి నిధులు

కొయ్యలగూడెం: సాగునీటి చెరువుల అభివృద్ధికి, తూముల మరమ్మతులకు రూ.48 లక్షలు మంజూరయినట్టు పీడబ్ల్యూడీ అప్‌ల్యాండ్ సబ్ డివిజన్ బందకట్టు సెక్షన్ ఏఈ భాస్కర్ గురువారం తెలిపారు. పోలవరం కడెమ్మ కాలువ పనులకు రూ.5 లక్షలు, బుట్టాయిగూడెం మండలం జల్లేరు రిజర్వాయర్, అలివేరు ప్రాజెక్టులకు రూ.10 లక్షల చొప్పున, కొయ్యలగూడెం మండలం శ్రీరాములు కట్టు చెరువు అభివృద్ధికి, వేదాంతపురం ఎర్ర చెరువుకు రూ.3 లక్షలు చొప్పున నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

రైతు కంట కన్నీరు



ఇంటి వద్ద వైద్యం అందిస్తున్న వైద్యులు



దివ్యాంగుడికి పెన్షన్ అందచేస్తున్న వలంటీర్, నాయకులు

- అన్నదాతను విస్మరించిన కూటమి సర్కార్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా రైతు ఇంటి వద్దకే సేవలు
- నిర్వీర్యమైన వలంటీర్ వ్యవస్థ

దెందులూరు: ఎన్నికల ముందు కూటమి నేతలు ఎన్నో వాగ్దానాలు చేశారు. పాత పథకాలు ఏమి రద్దు చేయమని అంతకు మించి పథకాలు అందిస్తామని హామీలు గుప్పించారు. తీరా అధికారం చేపట్టి ఏడాది కాలంలోనే వైఎస్సార్ సీపీ అమలు చేసిన పథకాలకు మంగళం పాడటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇళ్ల వద్దకే అన్నీ చందంగా వైఎస్సార్ సీపీ పాలన సాగింది. ముఖ్యంగా రేషన్ సరుకులు తెచ్చుకునే అంశంలో జనం విపరీతంగా కష్టపడేవారు. సుదూర ప్రాంతాలకు రేషన్‌షాపులకు వెళ్లడం, ఎంతోసేపు పడిగాపులు కాయడం కష్టంగా ఉండేది. ఈ కష్టాలకు చెక్ పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రేషన్ వాహనాలను ప్రవేశపెట్టింది. రేషన్ సరుకులు వాహనాలతో ఇంటికి పట్టుకొచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్‌వాహనాలను రద్దు చేసి రేషన్ షాపుల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని కూటమి సర్కార్ నియమం పెట్టింది. దెందులూరు నియోజకవర్గంలో 28 రేషన్ వాహనాలు ఉండేవి. ఇప్పుడు ఈ సేవలు నిలిచిపోయాయి. అలాగే ప్రతి 50 కుటుంబాలకు ఓ వలంటీర్‌ను నియమించి ఆ 50 కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయించే విధంగా వలంటీర్ సాయంగా ఉండేవారు. వలంటీర్ వ్యవస్థకు మంగళం పాడటంతో జనానికి పాత కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఎన్నికల్లో మభ్యపెట్టి ఏడాదిలోనే పాత కష్టాలు మళ్లీ చూపిస్తారా? అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేగవరంలోని రైతుభరోసా కేంద్రం

ఫ్యామిలీ డాక్టర్ సేవలకు దూరం:
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం పేదలకు దీర్ఘకాలిక బాధితులకు దూరం, భారం కాకూడదని ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేశారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వైద్యుడు విధిగా జాబ్‌చార్ట్ ప్రకారం దీర్ఘకాలిక బాధితులను, అనారోగ్యంతో మంచంపై ఉన్న వారికి ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు, పరీక్షలు చేశారు. సంతృప్తికరంగా సేవలందించారని బాధితులందరూ వైద్యులను, పథకాన్ని ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అభినందించారు. గతంలో ఏ ప్రభుత్వం వైద్యుడు ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు అందించిన దాఖలాలు లేవు. ఏ ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో లేవు. కాని ప్రస్తుత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు కానరావడం లేదు. బాధితులు వాహనాలు ఏర్పాటు చేసుకుని వైద్య సేవలకు వెళ్తున్న పరిస్థితులు వచ్చాయి.

వలంటీర్ల సేవలు భేష్

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది వలంటీర్లను నియమించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాలను ఇంటికి తీసుకువచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అభివృద్ధి, సంక్షేమ పథకాలు నెలకు 2, 3 చొప్పున ప్రతి ఏటా అమలు జరిగిందంటే దాని వెనుక లక్షలాది మంది వలంటీర్ల కృషి, శ్రమ ఉంది. బాధిత కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ఆ వలంటీర్ ద్వారా 50 ఇళ్లల్లో సర్వే చేసి అర్హులను ఆన్‌లైన్ చేసేవారు. ఆన్‌లైన్ అనంతరం ప్రతి నెల పెన్షన్ ఉదయం 5.30 గంటలకే ఇంటింటికి, వైద్యశాలలకు, పొలాలకు ఇతర జిల్లాలకు సైతం వెళ్లి వలంటీర్లు పెన్షన్ నగదు అందజేసేవారు. ఏ ప్రభుత్వ పథకం అమలుకు బయటకు వెళ్ళకుండా వలంటీర్లే ఇంటికి పంపించి సంక్షేమాన్ని ప్రతి గడపలోనికి పంపించిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు చరిత్ర ఉన్నంతకాలం గుర్తు ఉంచుకుంటారు. ఎన్నికల్లో కూటమి నాయకులు వలంటీర్లను తొలగించమని ప్రభుత్వం తొలగించడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది శాశ్వత ఉపాధి కోల్పోయారు.

ప్రజల గడపకే రేషన్ సరుకులు:
పాదయాత్రలో ప్రజల రేషన్ ఇబ్బందులను విని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ప్రజల ఇంటికే రేషన్ సరుకులు వాహనం ద్వారా అందించే పథకం ఏర్పాటు చేశారు.

రైతుకు మేలు చేసేలా ఉండాలి



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చేవారు. ప్రస్తుతం ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవల్సి ఉంది. గత ఏడాది ఎరువులు రైతులకు కావల్సినన్ని అందించలేదు. ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుక్కొని వాడాం. రైతులకు మేలు చేసేలా సేవా కేంద్రాలు ఉండాలి.

– డీబీఆర్‌కే చౌదరి రైతు వైఎస్ఆర్సీపి జిల్లా కార్యదర్శి

సేవలు అందడం లేదు



రైతు సేవాకేంద్రాలుగా మార్చిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు సక్రమంగా అందడం లేదు. ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్కులు ప్రస్తుతం వినియోగించకపోవడం వలన మూలనపడ్డాయి. ఇక వీటి ద్వారా సేవలు నామమాత్రంగా ఉన్నాయనే చెప్పాలి

– మాగంటి రాజు, రైతు

కొయ్యే మోషేన్‌రాజుకు సత్కారం



పెదపాడులో మోషేన్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

పెదపాడు: ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభాపతి కొయ్యే మోషేన్‌రాజును వైఎస్సార్ సీపీ ఇంటిలెక్చువల్ ఫోరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊదర గొంది చంద్రమౌళి గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఏపీ ఇంటిలెక్చువల్ ఫోరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఇతర నాయకులకు చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ కె చిట్టి రాజు, విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ గుమ్మాపు ఆనంద్ విక్టర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



కిల్కారి కాల్ సేవలు గురించి వివరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గర్భిణులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని కిల్కారి రాజు తెలిపారు. చేబ్రోల్ పీహెచ్‌సీలో కిల్కారి సేవలపై గర్భిణులు, బాలింతలకు వివరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేఎస్ వర్మ, డాక్టర్ శ్రవణ్ రెడ్డి, సీహెచ్‌వో యు.రత్న రాజ్యం, హెచ్‌వీ వీవీ నాగలక్ష్మి, హెచ్ఎస్ గంగాధర్‌లు పాల్గొన్నారు.

రైతు వద్దకు సేవలు ఎక్కడ?

- సకాలంలో అందని ఎరువులు, విత్తనాలు
- అందని పెట్టుబడి సాయం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



నాచుగుంట రైతు బరోసా కేంద్రం వెలవెలబోతున్న దృశ్యం

ఉంగుటూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుకు పెట్టుబడిసాయం ఇంతవరకు అందజేయలేదు. రైతులకు అవసరానికి ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు పంపిణీ చేయడం లేదు. గడిచిన 11నెలలుగా రైతులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విత్తన సరఫరా సక్రమంగా జరగలేదు. ఎరువుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. చివరిక పండిన ధాన్యం అమ్ముకోలేక అవస్థలు పడ్డారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ఇలా...
రైతు ప్రభుత్వంగా భావించిన గత వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు ఎన్నో పథకాలు అమలు చేసింది. ఐదేళ్లు సమయానికి పెట్టుబడి సహాయం అందజేసింది. పంటల బీమా, వడ్డీ రాయితీ, ఇలా చాలా పథకాలు అమలు చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూసింది. రైతు చెంతకే ఎరువులు, విత్తనాలు చేర్చింది. నిత్యం రైతు భరోసా కేంద్రాలు రైతులతో కళకళలాడుతూ ఉండేవి. కియోస్కో యంత్రాలు సక్రమంగా పనిచేసేవి. ప్రస్తుతం అవి పని చేయడం లేదు. రైతు విజ్ఞాన కేంద్రాలు ఆర్‌బీకేలు వర్ధిల్లాయి. ఇప్పుడు అంతా మారింది. రైతులపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం ఈ 11నెలల్లో అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతూ వచ్చింది.

ఉంగుటూరు నియోజకవర్గంలో 76 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు.

మండలం	రైతు భరోసా భవనాలు సంఖ్య.
ఉంగుటూరు	25
భీమడోలు	17
నిడమర్రు	14
గణపవరం	20
మెత్తం	76

పెట్టుబడి రాయితీ అందలేదు



రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ కాలంలో అన్నీ సౌకర్యాలు అందేవి. సమయానికి పెట్టుబడి రాయితీ వచ్చేది. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేవి. ఇప్పుడు అ పరిస్థితి లేదు. ఆర్‌బీకేలు నిర్వీర్యమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి రాయితీ ఇవ్వకపోగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ ప్రభుత్వానికి రైతుల అవసరాలు పట్టడం లేదు.

మారిశెట్టి సుబ్బారావు, రైతు, చేబ్రోలు

రైతులను మోసం చేసిన ప్రభుత్వం



రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. చంద్రబాబు అమలు కాని హామీలిచ్చి రైతులను మోసం చేశారు. జగన్ ప్రభుత్వమే మేలని సకాలంలో రైతు భరోసా రైతులకు అందజేసి పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందజేశారన్నారు.

చోడే వెంకటేశ్వరరావు, రైతు, కైకరం

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి



కె కన్నాపురంలో భాస్కరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్మిక సంఘ నాయకులు

పెదవేగి : ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్యంతో పెదవేగి మండలం కె.కన్నాపురం గ్రామానికి చెందిన కమిలి భాస్కరరావు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. భాస్కరరావు ఆత్మహత్యతో అతని కుటుంబం రోడ్డున పడిందని తెలిపారు. భాస్కరరావు తన ఇంటి నిర్మాణానికి మహేంద్ర ఫైనాన్స్ కంపెనీ నుంచి తీసుకున్న అప్పు చెల్లించడంలో ఆలస్యం అవ్వడంతో రికవరీ ఏజెంట్లు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేసి ఆత్మహత్యకు పాల్పడే విధంగా దోహదం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, సంబంధిత ఫైనాన్స్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కరరావు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ప్రజలను ఇబ్బందులు పాలు చేసే ఇలాంటి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వారి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏ రవి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ నాయకులు ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

థియేటర్ యాజమానులు నిబంధనలు పాటించాలి



భీమడోలులో టికెట్ ధరలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

భీమడోలు: సినిమా థియేటర్ల నిర్వహణలో నిబంధనలను పాటించకుంటే తగు చర్యలు తీసుకుంటామని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలులోని శ్రీనివాసా థియేటర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ముమ్మర తనిఖీలు చేశారు. భీమడోలులో వీఆర్వోలతో కలిసి భీమడోలు తహసీల్దార్ రమాదేవి ఆకస్మిక తనిఖీలు చేశారు. థియేటర్ పరిసరాలు, టాయిలెట్స్, హాలు లోపల, బయట పరిసరాలను ఆమె పరిశీలించారు. థియేటర్‌కు సంబంధించి బీఫారం, అనుమతులు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుసరించి టిక్కెట్ ధరలు విక్రయాలు జరుగుతున్నదీ లేనిదీ ప్రేక్షకుల నుంచి అడిగి తెలుసుకున్నారు. తినుబండారాలపై ఉన్న ధరలు, వాటిని గడువు తేదీలను ఆమె పరిశీలించారు. వాటి ధరలను అడిగారు. థియేటర్‌లోని పారిశుద్ధ్యం, హాల్ పరిశుభ్రతను పరిశీలించి నిర్వాహకులను పలు సూచనలందించారు. నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు వినోదాన్ని అందించే థియేటర్లలో వీక్షకులను మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ప్రతాప్, మార్కేండేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



భీమడోలులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు గురువారం ఉల్లాసభరిత వాతావరణంలో జరిగాయి. శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ అందించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వేచ్ఛాంధ్ర 2047 అంశాలపై చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణానికి విఘాతం కలిగించే అంశాలపై చక్కని చిత్రాలు గీసారు. న్యాయనిర్ణేతగా టీచర్ కె.తులసి వ్యవహరించారు. తొలుత గ్రంథాలయాల్లో యోగాసనాలను విద్యార్థులచే వేయించారు. సామూహిక పుస్తక పఠనం చేసి పుస్తక సమీక్షలు రాసారు. అన్నింటి కన్నా స్నేహమే గొప్పది అనే నీతి కథను వివరించారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ యోగాసనాలను నేర్చుకుని తమ జీవితాల్లో నిత్యకృత్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు యోగాసనాలు వేసేందుకు ఉత్సాహాన్ని కనుబర్చారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం
ఉంగుటూరు: నిత్యం యోగా చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం యోగాంధ్రలో భాగంగా ఉంగుటూరులో జరుగుతున్న యోగా తరగతులకు ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌మనోజ్, తహసీల్దార్ కుమార్, సర్పంచ్ బండారు సింధు, ఆయుర్వేద డా. శంకర్ ప్రసాద్, కూటమి నాయకలు పాల్గొన్నారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (టూటౌన్) : జూలై 9న దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ప్రజలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో నిర్వహించిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, అవుల శేఖర్ ఏలూరు జిల్లా నూతన నాయకత్వాన్ని ప్రకటించారు.

మేతర సురేష్‌కు సన్మానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరానికి అంబికా దర్బార్ బత్తితో ప్రపంచ ఖ్యాతి తీసుకొచ్చిన అంబికా సంస్థల వ్యవస్థాపకులు దివంగత ఆలపాటి రామచంద్రరావు రూపాన్ని అగ్గిపుల్లపై ఆవిష్కరించిన చిత్రకారుడు మేతర సురేష్‌ను అంబికా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికా రాజా దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. రామచంద్రరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా రూపొందిచిన ఈ చిత్రాన్ని రాజాకు గురువారం సురేష్ అందజేశారు.

భూముల పరిశీలన

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపుకు గురవుతున్న అల్లూరి సీతారామ రాజు జిల్లా వీఆర్‌పురం, కూనవరం మండలాల పరిధిలోని నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం మండలంలో అనువైన భూములను పరిశీలిస్తున్నామని ఆర్‌డీఓ ఎంవీ రమణ, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెకర్ సరళ వందనంలు తెలిపారు. బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం గ్రామంలో నిర్వాసితుల కోసం సేకరించిన భూములను పరిశీలించారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పునరావాస కాలనీల నిర్మాణానికి సుమారు 600 ఎకరాలకు పైగా భూములు అవసరం కాగా ప్రస్తుతం 300 ఎకరాల వరకు పరిశీలించామని తెలిపారు. నిర్వాసితులను ఆయా భూములకు తీసుకువచ్చి, వారి ఆమోదంతోనే వాటికి సేకరించామని వివరించారు.

నిర్దేశిత సౌకర్యాలు కల్పించాలి



పెట్రోల్ బంక్ యాజమాన్యం, రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ స్లీవజోజి

జంగారెడ్డిగూడెం: వినియోగదారులకు నిర్దేశించిన సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన పెట్రోల్ బంక్ యాజమాన్యం, రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మండల పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్‌లలో పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్స్‌ను ఎప్పటికప్పటి శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి వాహనానికి ఉచితంగా గాలి పట్టాలని, తాగునీరు సదుపాయం కల్పించాలని ఆదేశించారు. పెట్రోల్, డిజిల్ ధరలు ఎప్పటికప్పుడు బోర్డు ద్వారా వినియోగదారులకు ప్రదర్శించాలన్నారు. పెట్రోల్, డిజిల్ నాణ్యతగా నిర్దేశించి ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ప్రతి నెలా అధికారులు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేస్తారని తెలిపారు.

1 నుంచి చౌక డిపోల వద్దే రేషన్ పంపిణీ
ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించి పాత పద్ధతిలోనే జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు నిత్యావసరాలు అందించాలని తహసీల్దార్ రేషన్ డీలర్‌లను ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాప్ వద్ద సరుకులు పంపిణీ చేయాలన్నారు.